క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దౌల్తాబాద్: మండల కేంద్రంలో 33/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏఈ మహిపాల్ ఒక ప్రకటలో పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

క్రీడాకిట్లు పంపిణీ

బొంరాస్‌పేట: క్రీడల్లో యువతను ప్రోత్సహించేందుకు క్రీడాకిట్లను అందజేస్తున్నామని సర్పంచ్ మహిపాల్ అన్నారు. సంక్రాంతి సందర్భంగా మంగళవారం మండల పరిధి మహంతీపూర్‌లో పలువురు క్రీడాకారులకు క్రీడా సామగ్రి పంపిణీ చేసి మాట్లాడారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఇందులో వార్డు సభ్యుడు అంజి ఉన్నారు.

అయ్యప్ప పడిపూజ



అభిషేకం చేస్తున్న అయ్యప్ప భక్తులు

తాండూరు రూరల్: తాండూరు మండలం సంగెంకలాన్ సర్పంచ్ సంగెం మేఘనాథ్‌గౌడ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడిపూజను ఘనంగా నిర్వహించారు. యేటా సంక్రాతి రోజున పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో పూజలు చేస్తారు. ఈ సారి కూడా సోమవారం సాయంత్రం స్వామి వారి సన్నిధిలో అయ్యప్ప భక్తుల భజనల నడుమ స్వామివారికి అభిషేకం చేసి, పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ ప్రాంగణంలో మకరజ్యోతి దర్శనం కూడా కల్పించారు.

విద్యుదాఘాతంతో పాడిపశువు మృతి



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పశువు కళేబరం

కొడంగల్ రూరల్: విద్యుదాఘాతంతో ఓ పాడి పశువు మృతి చెందిన సంఘటన మండల పరిధి హస్నాబాద్‌లో మంగళవారం చోటుచేసుకుంది. ఘటనా వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బచ్చమోళ్ల భీమేష్‌కు చెందిన పాడి పశువు మేత మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో కరెంట్ షాక్ తగిలి మృత్యువాత పడింది. దీంతో బాధిత రైతు బోరున విలపించాడు. ఇటీవలే రూ.లక్ష వెచ్చించి కొనుగోలు చేశానని, ఇప్పుడు అది చనిపోవడంతో తాను నష్టపోయానన్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని భీమేష్ ప్రభుత్వాన్ని కోరాడు.

మకర విలక్కు పూజలు



పూజలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

కొడంగల్: పట్టణ శివారు బండల ఎల్లమ్మ ఆలయ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. మకర సంక్రాంతి సందర్భంగా మకర విలక్కును పురస్కరించుకొని పూజలు చేసినట్లు గురు స్వాములు ఉమాపతిగౌడ్, తలారీ గోపాల్, బుక్క విజయ్‌కుమార్ తెలిపారు. మండలం రోజుల పాటు నిష్టగా దీక్ష చేసి, కేరళలోని శబరిమలకు వెళ్లి, మణికంఠుడిని దర్శించుకొని వచ్చామన్నారు. జ్యోతి దర్శనం వరకు దీక్షను కొనసాగించనున్నామన్నారు. అయ్యప్ప భక్తులు రాజు, వెంకట్ యాదవ్, ప్రవీణ్, అశోక్, రాహుల్ ఉన్నారు.

పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీలు కీలకం



కమిటీ సభ్యులతో సీనియర్ నాయకుడు

యాలాల: పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీలు ఎంతో కీలకమని కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు పేరి రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం యాలాల గ్రామ కమిటీ, యూత్ కాంగ్రెస్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా సులేమాన్, అధ్యక్షుడిగా నాగయ్య, ఉపాధ్యక్షులుగా మోయిజ్, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా అహ్మద్, సహాయ కార్యదర్శిగా గొల్ల చందు, కోశాధికారిగా హన్మంతును ఎన్నుకున్నారు. యూత్ గౌరవ అధ్యక్షుడిగా మాల మారుతి, అధ్యక్షుడిగా మంగలి అశోక్, ఉపాధ్యక్షుడిగా నరేష్, శేఖర్, ప్రధాన కార్యదర్శిగా సాయిలు, సహాయ కార్యదర్శిగా లక్ష్మణ్, కోశాధికారిగా ఫజిల్‌లను ఎన్నుకున్నారు.



కుల్కచర్ల: ఇంటి ఎదుట ముగ్గు వేస్తున్న యువతి



కొడంగల్ రూరల్: ఓం శాంతి నిలయం ఎదుట ముగ్గు



ధారూరు: శాలివాహన కాలనీలో..



మోమిన్‌పేట: టేకులపల్లిలో బాలిక

ఘనంగా సం'క్రాంతి'

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వీధులన్నీ రంగుల హరివిల్లును తలపించగా.. గాలిలో ఎగిరిన గాలిపటాలతో ఆకాశ వీధులన్నీ మెరిసే తారల్లా కనువిందు చేశాయి. వయోభేదం లేకుండా సకల జనులు రకరకాల పతంగులను ఎగురవేస్తూ కేరింతలు కొట్టగా.., సప్త వర్ణాల కలయికతో ఆడ పడుచులు ఇంటి ముంగిట్లో తీరొక్క ముగ్గులు వేసి మురిసిపోయారు.
– సాక్షి, నెట్‌వర్క్



బంట్వారం: ఇంటి ఆవరణలో ముగ్గులు వేస్తున్న కుటుంబం



వికారాబాద్: సీతారాములతో కూడిన ముగ్గు



పరిగి: పాలేపల్లిలో ముగ్గుకు రంగులు వేస్తున్న చిన్నారి



కుల్కచర్ల: ముగ్గుకు రంగులు అద్దుతున్న చిన్నారి

కొత్తగా మూడు ఆధార్ సెంటర్లు

- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- ఆర్డీఓ శ్రీనివాస్

తాండూరు టౌన్: ప్రజా అవసరాల మేరకు తాండూరు పట్టణంలో కొత్తగా మూడు ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆర్డీఓ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం నుంచి పాత మున్సిపల్ భవనంలో ఆధార్ సేవలు వారం రోజుల పాటు కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. వారం తరువాత పట్టణంలో ఒక శాశ్వత కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు ఒక్కో కేంద్రంలో 50 టోకెన్ల చొప్పున మొత్తం 150 టోకెన్లను ప్రజలకు అందజేయనున్నామని వెల్లడించారు. ఈ కేంద్రాల్లో మొబైల్ నంబర్ అప్‌డేట్ (రూ.50), ఫొటో, బయోమెట్రిక్ అప్‌డేట్ (రూ.100), పేరు, ఇంటి పేరు సవరణ (18 ఏళ్లు పైబడిన వారికి రూ.50, 18 ఏళ్ల లోపు వారికి రూ.100) వంటి సేవలు అందించనున్నట్లు చెప్పారు. పలు సాంకేతిక కారణాల వలన చిరునామా మార్పు, నూతన ఆధార్ కార్డు సేవలను అందించడం లేదన్నారు. త్వరలోనే అవి కూడా అందుబాటులోకి తెస్తామని ఆర్డీఓ తెలిపారు. అయితే తొలిరోజున సర్వర్ డౌన్ కావడం వలన కొందరికి మాత్రమే సేవలు అందించామని, నేటి నుంచి అలాంటి సమస్యలేవీ ఉండవని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.



పాత మున్సిపల్ భవనంలో కొనసాగుతున్న ఆధార్ సేవలు

గడపగడపకూ రాములోరి అక్షితలు



పరిగి: లక్ష్మీదేవిపల్లి గ్రామంలో అక్షితలను పంపిణీ చేస్తున్న రామ భక్తులు

పరిగి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అయోధ్య నుంచి వచ్చిన అక్షితలను మండల పరిధి లక్ష్మీదేవిపల్లి, తదితర గ్రామాల్లో మంగళవారం రామభక్తులు ఇంటింటికీ పంపిణీ చేశారు. తొలుత అక్షితలకు స్థానిక హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం గడపగడపకూ పంచిపెట్టారు. ఈ సందర్భంగా శ్రీరామ నామస్మరణ మారుమ్రోగింది. ఈ నెల 22 అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో ఇంటింటా పండుగ చేసుకోవాలని కోరారు. రామ భక్తులు పాల్గొన్నారు.



కొడంగల్ రూరల్: అక్షితలను పంపిణీ చేసేందుకు వెళ్తున్న రామ భక్తులు

పెద్దవారితో ఆశీర్వాదంగా..

కొడంగల్ రూరల్: పట్టణ పరిధి ఆర్యనగర్, ఇంద్రనగర్, తెలంగ్‌వాడి తదితర కాలనీల్లో రాములోరి పూజిత అక్షితలను ఇంటింటికీ పంపిణీ చేశారు. అంతకు ముందు అక్షితల కలశాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రామభక్తులు అక్షితలు, పసుపు, కుంకుమలను ప్రజలకు అందజేస్తూ, వాటిని ఇంట్లోని దేవుడి పటం వద్ద పెట్టుకోవాలని, 22న ఇంట్లోని పెద్దవారితో ఆశీర్వాదంగా శిరస్సుపై చల్లించుకోవాలని సూచించారు.

సర్కారీ స్కూళ్లకు రక్షణ కరువు

- అపరిశుభ్రతమైన మైదానాలు
- అభద్రతాభావంతో విద్యార్థులు
- ప్రహరీల వినతులు ప్రతిపాదనలకే పరిమితం

దౌల్తాబాద్: సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య, కార్పొరేట్ స్కూళ్లకు మించిన సౌకర్యాలు అంటూ పాలకులు, అధికారులు చెప్పే మాటలకు, వాస్తవ రూపానికి ఎనలేని వ్యత్యాసం ఉందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. చదువు సంగతి ఎలా ఉన్నా.. పాఠశాలకు కనీస ప్రహరీలు లేక, అపరిశుభ్రత వాతావరణంలో, అభద్రతాభావంతో విద్యార్థులు తమ చదువును కొనసాగిస్తున్నారని వాపోతున్నారు. బడికి వెళ్లిన తమ పిల్లలు ఇంటికి వచ్చేదాకా నమ్మకం లేకుండా పోయిందని ఆవేదన చెందుతున్నారు. ఉపాధ్యాయ బృందం సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పలువురు పేర్కొన్నారు. తమ పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యనందిస్తున్నామని చెబుతున్నా.. చాలా పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయని మండిపడుతున్నారు.

రహదారి పక్కనే బడి

పాఠశాలల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు విశ్రాంతి సమయంలో బయటకు వెళ్తున్నారని, ఆటలాడుతూ రోడ్లపైకి వెళ్లడంతో వారికి ఏం జరుగుతోందని తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. రహదారి పక్కనే పాఠశాల ఉండి, దానికి తోడు చుట్టూ గోడ లేకపోవడంతో వారి భయాందోళనకు కారణమని దీన్ని బట్టి స్పష్టమవుతోంది. ఇదిలా ఉండగా.. పశువులు, కుక్కలు, పందులు, కోతులు పాఠశాల ఆవరణలో సంచరిస్తున్నాయి. కొన్ని బడుల్లోకి విష సర్పాలు, కీటకాలు సైతం వస్తుండటంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రహరి లేని కారణంగా సెలవు రోజుల్లో బడి ప్రాంగణం అపరిశుభ్రంగా తయారవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రహరీ లేని పాఠశాలలు ఇవే..

మండలంలో 45 ప్రాథమిక, 8 ఉన్నత, 8 ప్రాథమికోన్నత పాఠశాలున్నాయి. వీటిలో పలు పాఠశాలలకు ప్రహరీలు లేవు. మండల కేంద్రం హరిజన్‌చేరి పాఠశాల, గోకఫసల్‌వాద్ ఉన్నత పాఠశాల, గుముడాల ప్రాథమికోన్నత పాఠశాల, తిమ్మాయిపల్లి, సుంకర్‌నగర్, నందారం, ఇందాపూర్, గుండేపల్లి, సుల్తాన్‌పూర్, తిర్మలాపూర్ పాఠశాలలకు కరువు. డైస్‌లో ఉపాధ్యాయులు ఉన్నతాధికారులకు నివేదించారు. కానీ నిధులు మంజూరు కావడం లేదన్నట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధులు స్పందించి, తగిన చర్యలు చేపట్టి, సమస్యలు తీర్చాలని తల్లిదండ్రులు, అధ్యాపకబృందం కోరుతోంది.



ప్రహరీలేని గోకఫసల్వాద్ ఉన్నత పాఠశాల

రూ.లక్ష ఆర్థిక సహాయం

అనంతగిరి: వికారాబాద్ మండలం పులుసుమామిడి గ్రామానికి చెందిన ఎండీ ఖాదర్ పాష ఇటీవల వాహనం బోల్తా పడిన ఘటనలో మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు సంతానం. పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న ఆ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలని స్నేహితులంతా భావించి, రూ.లక్ష పోగేశారు. పాష కూతురు పేరిట బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన మిత్రబృందాన్ని గ్రామస్తులు అభినందించారు.

'సూది'ని సేవలు చిరస్మరణీయం



పరిగి: జైపాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



తాండూరు టౌన్: స్ఫూర్తిస్థల్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

- జైపాల్‌రెడ్డి జయంతిలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు

పరిగి: దివంగత నేత, కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంత్ ముదిరాజ్ అన్నారు. జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం పట్టణకేంద్రంలోని టీఆర్ఆర్ నివాసంలో కాంగ్రెస్ నేతలు.. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హన్మంత్ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి.. జైపాల్‌రెడ్డి జయంతిని అధికారికంగా నిర్వహించాలని పేర్కొనడం హర్షణీయమన్నారు. రాష్ట్ర అభ్యున్నతికోసం పాటు పడినవారిని ప్రభుత్వాలు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని సూచించారు. తెలంగాణ సాధన కోసం జైపాల్‌రెడ్డి కీలక భూమిక పోషించారని తెలిపారు. చేవెళ్ల ఎంపీగా, కేంద్ర మంత్రిగా దేశానికి, రాష్ట్రానికి సూదిని ఎనలేని సేవలు అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, నాయకులు అక్బర్, రామకృష్ణ, ఆంజనేయులు, జగన్, తౌరియానాయక్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిస్థల్‌లో..

తాండూరు టౌన్: కేంద్ర మాజీ జైపాల్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని ఆయన సమాధి స్ఫూర్తిస్థల్‌లో వద్ద ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఆయనతో పాటు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



దోమ: క్రీడాకారులతో సర్పంచ్

- చదువుతో పాటు ఆటలతో భవిష్యత్తు
- టోర్నీ ముగింపు కార్యక్రమంలో నేతలు
- విజేత జట్లకు బహుమతుల అందజేత

దోమ: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని సర్పంచ్ పద్మ అన్నారు. మంగళవారం దోమ మండల పరిధి బాస్‌పల్లిలో మూడు రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ పాల్గొని, విజేతలకు మొదటి బహుమతి రూ.6 వేలు, రెండో బహుమతి రూ.3 వేలను అందజేసి, జ్ఞాపికలు ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడారు. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దేహదారుఢ్యం కలుగుతుందన్నారు. ఆటల్లో గెలుపు, ఓటములు సహజమని, ప్రతి క్రీడాకారుడు విజయం సాధించటానికి ప్రయత్నించాలని సూచించారు.

గ్రామగ్రామాన ఆటల పోటీలు

కుల్కచర్ల: ఐక్యతతో గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు నిర్వహించడం అభినందనీయమని జెడ్పీటీసీ రాందాస్ నాయక్, సీటీఓ రాంచందర్ నాయక్ అన్నారు. యువత చదువుతో పాటు ఆటల్లో రాణించడం వలన భవిష్యత్తు బంగారుమయంగా కానుందని పేర్కొన్నారు. మండల పరిధి కుల్కచర్ల, ఇప్పాయిపల్లి, తిర్మలాపూర్, బండవెల్కిచర్లలో క్రికెట్, వాలీబాల్ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాయకుడు అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపు, ఓటములు సహజం

పూడూరు: క్రీడలతోనే సత్సంబంధాలు మెరుగుపడతాయని వివేకానందా యువజన సంఘం అధ్యక్షుడు శ్రీశైలం అన్నారు. గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధి మేడిపల్లికలాన్‌లో వాలీబాల్ ప్రీమియం లీగ్ టోర్నీని నిర్వహించగా.. టోర్నీలో 8 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో మొదటి బహుమతి గెలుచుకున్న మహేశ్ జట్టుకు రూ.5వేలు, కుమ్మరి ఆకాష్ జట్టుకు రూ.3వేల నగదును ద్వితీయ బహుమతిగా అందజేశారు. క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో దాతలు తుప్పరి మల్లేశ్, తెలుగు రాజు, యువజన సంఘం నాయకులు రమేష్, వెంకటేశ్, ప్రకాష్, గ్రామ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు

నవాబుపేట: చదువుతో పాటు ఆటల్లో రాణిస్తే యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందని బీఆర్ఎస్ నాయకుడు సిందం మల్లేశం అన్నారు. మండల పరిధి గంగ్యాడ గ్రామంలో ఇటీవల మరణించిన శ్రీకాంత్‌రెడ్డి జ్ఞాపకార్థం వాలీబాల్ టోర్నీ నిర్వహించారు. ఆ పోటీల్లో 8 జట్లు పాల్గొన్నాయి. విజేత జట్టుకు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడారు. యువత చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని, చదువుకు ఆటలు తోడైతే ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాంచంద్రారెడ్డి, టీచర్ మాణిక్యం, యువకులు తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: బ్యాటింగ్ చేసి టోర్నీ ప్రారంభిస్తున్న దృశ్యం



పూడూరు: బహుమతులు ప్రదానం చేస్తున్న యువజన సంఘం నాయకులు



నవాబుపేట: బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

గోదాదేవికి నీరాటోత్సవం

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన పట్టణంలోని పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం గోదాదేవికి నీరాటోత్సవం నిర్వహించారు. డిసెంబర్ 17వ తేదీ నుంచి ప్రారంభమైన ధనుర్మాస పూజలు ముగిశాయి. కనుమ పండుగ సందర్భంగా మంగళవారం పుష్కరిణి వద్ద అమ్మవారికి ఉత్సవం అలంకార తిరుమంజనం, నీరాటోత్సవ మహాభిషేకం నిర్వహించారు. పసుపు, చందనం, తేనె, నెయ్యి, కుంకుమ తదితర పంచామృతాలతో నీరాటోత్సవం జరిపారు. అనంతరం అమ్మవారికి అలంకరణ చేసి చాటవాయినాలు, నైవేద్యం సమర్పించారు. ఆలయ వీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవేరుల సమేత శ్రీనివాసుడిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నందారం శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.



అమ్మవారి ఊరేగింపు

పశువుల సంతతో ఆదాయం

మాజీ హోంమంత్రి మహమూద్‌అలీ

షాబాద్: పశువుల సంతతో మార్కెట్‌కు మంచి ఆదాయం వస్తుందని మాజీ హోంమంత్రి మహమూద్‌అలీ అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధి సర్దార్‌నగర్ పశువుల సంతను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడారు. పాడి పశువుల కొనుగోలు నిమిత్తం మార్కెట్‌కు వచ్చినట్లు మహమూద్ అలీ పేర్కొన్నారు. కనుమ పండుగ సందర్భంగా పశువులు తక్కువగా వచ్చాయని అధికారులు మహమూద్‌అలీతో చెప్పారు. దీంతో తాను పశువులను కొనలేదని, మరోసారి వచ్చి పాడి పశువులను కొనుగోలు చేస్తానని చెప్పారు. ఆయన వెంట సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగరావు, కార్యదర్శి సుజాత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.